నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

ఆదివారం | డిసెంబర్ 24, 2023 | www.navatelangana.com

వాజీద్‌నగర్‌లో కుస్తీ పోటీలు



నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని వాజీద్‌నగర్ గ్రామంలో గ్రామదేవతల మూడురోజుల ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఎడ్లబండ్లతో ఊరేగింపు నిర్వహించారు. రెండోరోజు శనివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ గ్రామాలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. కుస్తీ పోటీల్లో గెలుపొందిన మల్లయోధునికి మొదటి బహుమతిగా రూ.5100, రెండవ బహుమతిగా రూ.2500 గ్రామపెద్దల చేతుల మీదుగా అందజేశారు. మూడోరోజు ఎడ్లబండ్ల ఊరేగింపుతో పాటు నాటక ప్రదర్శన ఉంటుందని గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో తోట అనసూయలక్ష్మీనారాయణ, ఎంపిటిసి బండకిందిబ సాయిలు, ఉప సర్పంచ్ బద్రి సాయిలు, మాజీ ఎంపీపీ సాయన్న, గోపాల్‌రెడ్డి పటేల్, గుండా శ్రీనివాస్, కుంటేళ్లప్ప శ్రీనివాస్, గ్రామప్రజలు ఉన్నారు.

స్టైల్స్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని స్టైల్స్ ద స్కూల్‌లో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ షబానా గౌహర్ డైరెక్టర్ రఫీ గోహర్, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సెలబ్రేషన్స్‌లో అమ్మాయిలందరూ ఏంజెల్స్‌లాగా, అబ్బాయిలందరూ శాంటా క్లాస్‌లాగా వేషధారణలో వచ్చారు. చిన్నారులందరూ క్రిస్మస్ సాంగ్స్‌లో రైమ్స్‌లో ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ విమల, సింధుజ, శ్రావణి, రోజ, సవిత, స్వప్న, సంతోషిని, స్వప్న సరిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై

రైతులు దృష్టి సారించాలి

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- పంటల సాగుపై నిపుణులతో ప్రత్యేక సమావేశం
- కోస్లీలో సాగునీటి విడుదల



నీటివిడుదల చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నవీపేట్

రైతులు మరింత అభివృద్ధి చెందేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మండలంలోని కోస్లీ పంప్ హౌస్ వద్ద యాసంగి సాగుకై అలీసాగర్ నీటిని శనివారం ఆయన విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు సాగునీరు వృథా కాకుండా పంటలు పండించుకోవాలని అధికారుల సైతం ప్రతి తూము వద్ద సెటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నియోజకవర్గంలో వరి పంట 80 వేల ఎకరాలలో సాగు చేయగా కేవలం 16 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు నిర్ధారించారని అన్నారు. త్వరలోనే రాష్ట్రంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, నిపుణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు ఆయన తెలిపారు. రైతులకు ఎరువుల సమస్య లేదని సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. అనంతరం ఆయాగ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, గడుగు గంగాధర్, తాహెర్‌బిన్ హందాన్, వైస్ ఎంపీపీ ఇందూరు హరీష్, మాజీ ఎంపీపీ రాజేందర్ గౌడ్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, బాల్ రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించండి

- ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. శనివారం ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి సంబంధించిన డివిజనల్, మండల అన్ని ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్యలతో వచ్చిన ప్రజల దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారులకు పలు కీలక సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్, ప్రభుత్వ అధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆయా డివిజన్ స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు నాయకులు అధికారులు అందుబాటులో ఉండాలి..

ప్రజలకు నాయకులు, అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. శనివారం ఎల్లారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాధవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తేవాలని ఆయన అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించాలని సమస్యలను పరిష్కరించడానికి తమ దృష్టికి తీసుకురావాలని అందరం కలిసికట్టుగా పనిచేసి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, ఎంపీడీవో లక్ష్మి, జడ్పిటిసి ఉషాగౌడ్, ఆర్డీవో ప్రభాకర్, ఎంపీఓ ప్రకాష్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపరులను సహించేది లేదు..

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే మదన్ రావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడితే ఎంతటి వారైనా శిక్షించే తీరుతామని అన్నారు. ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని అవినీతిరహిత ఎల్లారెడ్డిగా తీర్చిదిద్దుతానని అన్నారు. పలువురు రాజకీయ నాయకులు అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని తన దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై సమీక్ష చేసి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించినట్టు తెలిపారు. ఏ శాఖలో లోపాలున్నాయో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే..

పట్టణ కేంద్రంలో వికెవి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పాల్గొన్నారు. క్రిస్మస్‌ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యేసుప్రభు చెప్పిన ప్రతివాక్యాన్ని మనం పాటిస్తూ మంచి మార్గంలో నడవాలని అన్నారు. గత సంవత్సరం ఎల్లారెడ్డిలో తన సొంత ఖర్చులతో దుస్తులు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎల్లారెడ్డిలో అతి తొందరలోనే క్రిస్టియన్ భవన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. క్రైస్తవ సోదరులకు తెలంగాణ ప్రభుత్వం తరపున క్రిస్మస్ బహుమతిని అందచేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డిఓ ప్రభాకర్, ఎల్లారెడ్డి పాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎస్.రవీందర్‌కు నియామకపత్రం



నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని సారంగాపూర్‌లోని బీఈడీ కళాశాలకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా డాక్టర్ రవీందర్‌ను నియమించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని తెలంగాణ యూనివర్సిటీ సారంగాపూర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సాయిలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డికి రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రపతి ముర్మును కలిసిన మాజీ రైల్వే జెడ్ఆర్‌యూసీసీ మెంబర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

వార్షిక దక్షిణాది పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ వచ్చిన నేపథ్యంలో మాజీ రైల్వే జెడ్ఆర్‌యూసీసీ మెంబర్ రమేష్ ముస్త్యల రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. మంత్రి సీతక్క రమేష్ ముస్త్యలను భారత రాష్ట్రపతి ముర్ముకు పరిచయం చేశారు. ములుగు డిసిసి అధ్యక్షుడు అశోక్ ఈ సమావేశంలో పాల్గొని సన్మానించారు.



కాంగ్రెస్‌లోకి ఎంపీటీసీలు

- ఒక్కొక్కరుగా చేరుతున్న వైనం
- ఎంపీపీ పదవికి ఎసరు వచ్చేనా..?

నవతెలంగాణ-మద్నూర్

పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ హవా కొనసాగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మద్నూర్ ఉమ్మడి మండలంలో అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌కి చెందిన ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే మిగిలారు. అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ని కాకుండా కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకురావడం, జుక్కల్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ అభ్యర్థి హనుమంతు షిండేను ఓడించడంతో బీఆర్ఎస్ ఎంపీటీసీలు పార్టీని మారుతూ కాంగ్రెస్ పార్టీకి ఒక్కొక్కరుగా చేరుతున్నారు. ఈ మండలంలో కాంగ్రెస్ ఎంపీటీసీల సంఖ్య ముగ్గురు ఉండగా బీఆర్ఎస్ నుంచి మరో ఆరుగురు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆ పార్టీ ఎంపీటీసీల సంఖ్య 9కి చేరింది. మద్నూర్ ఉమ్మడి మండలంలో మొత్తం ఎంపీటీసీల సంఖ్య 17 మంది ఉండగా.. అప్పట్లో కొందరు కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎంపీటీసీలు బిఆర్ఎస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇద్దరు, ముగ్గురు ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకోవడంతో బీఆర్ఎస్ ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో ఒక్కొక్కరుగా చేరుతున్నారు. కాంగ్రెస్‌లో మొత్తం తొమ్మిది మంది ఎంపీటీసీలుగా సంఖ్య పెరిగింది. ఇక మిగిలిన వారు ఏడుగురిలో మరికొందరు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రజల్లో చర్చలు వినబడుతున్నాయి. దీన్ని బట్టి చూస్తే ఎంపీపీ అధ్యక్ష పదవి అవిశ్వాసానికి సిద్ధం కావొచ్చునే చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఎంపీపీ అధ్యక్ష పదవి ఎస్సీ మహిళా రిజర్వ్‌గా ఉంది. ఒకవేళ అవిశ్వాసం పెడితే ఎంపీపీ అధ్యక్ష పదవి కొడిచెర ఎంపీటీసీగా కొనసాగుతున్న యాదాబాయికి వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి ఎంపీటీసీలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్‌లో చేరడం ఎంపీపీ పదవికి ఎసరు పెట్టే అవకాశాలు మెండుగానే కనిపిస్తున్నాయి.



నిలిచిపోయిన వాహనాలు

వంగిన కంటెయినర్

- సరిచేసేందుకు ప్రయత్నించగా.. బోల్తా
- భారీగా నిలిచిన ట్రాఫిక్
- నత్తనడకన హైవే బ్రిడ్జి పనులు

నవతెలంగాణ-సదాశివనగర్

నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న ఓ కంటెయినర్ మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో నిర్మిస్తున్న బ్రిడ్జి సమీపంలో ఓ పక్కకు వంగిపోయింది. దీంతో దానిని క్రేన్ సహాయంతో సరిచేసేందుకు ప్రయత్నిస్తుండగా సపర్ట్ కోసం వేసిన పట్టీ తెగిపోవడంతో బోల్తాపడింది. దీంతో ఆ రహదారి గుండా వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. దీంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు

ఎంపికైన మిట్టపల్లి క్రీడాకారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 21 నుంచి 23 వరకు ఎన్టీఆర్ స్టేడియం నిర్మల్‌లో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అండర్ 17 పోటీలలో జిల్లా జట్టు తరపున డిచ్‌పల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు బాలికల విభాగంలో గంగా జమున, బాలుర విభాగంలో దేవేందర్ పాల్గొని జిల్లా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి జనవరి 12 నుంచి 16 వరకు బికినీర్, రాజస్థాన్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్ తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులు మర్కంటి గంగామోహన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.



నిజాంషుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు బ్లాక్ డే

నవతెలంగాణ-బోధన్

బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీ ప్రభుత్వాల స్వార్థపూరిత నిర్ణయాల వలన మూతపడడంతో కార్మికులు రోడ్డునపడ్డారని దాంతో కార్మికులకు ఇది చీకటి రోజని కోరుతూ.. శనివారం కార్మికులు బ్లాక్ డేగా నిర్వహించినట్లు కార్మిక సంఘం నాయకులు ఉపేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2015 డిసెంబర్ 23వ తేదీన ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం అన్యాయంగా లేఆఫ్ చేశారని, 8 సంవత్సరాల నుంచి కార్మికులకు వేతనాలు లేక ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని, అనారోగ్యంతో ఎంతోమంది కార్మికులు చనిపోయారని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల సమావేశాలు ఫ్యాక్టరీని తెరిపిస్తామని అనడం శుభ సూచకమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి గొంతుకోసిన దుండగుడు



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని చిన్నవాల్గోట్ గ్రామ శివారులో ఓ గుర్తుతెలియని వ్యక్తి పిట్ల రాములు (50) అనే వ్యక్తి గొంతు కోసి పారిపోయాడు. స్థానిక ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం. రామారెడ్డి మండలం పోసానిపెట్ గ్రామానికి చెందిన పిట్ల రాములు సిరికొండ మండలంలోని చిన్నవాల్గోట్ గ్రామంలో కొంతకాలంగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి చిన్నవాల్గోట్ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి కత్తితో రాములు గొంతుకోసి పరారయ్యాడు. దీంతో రాములు స్పృహ కోల్పోయాడు. ఉదయం 4గంటల సమయంలో మెలుకువ రావడంతో ఇంటికి తానంతటా తానే వెళ్లి గుమ్మం ముందు పడిపోయాడు. శనివారం ఉదయం 5గంటల సమయంలో కుటుంబ సభ్యులు తలుపులు తీసే సమయానికి స్పృహతప్పి పడిపోవడంతో హుటాహుటినా వారు అంబులెన్సులో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల కేరళ టాలెంట్ స్కూల్ పాఠశాలలో శనివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. అనంతరం క్రిస్మస్ తాత వేషధారణలో విద్యార్థులకు ఆటపాటలతో కనువిందు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల జిమ్మీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీవో రాజేశ్వర్ సస్పెన్షన్

నవతెలంగాణ-నవీపేట్

మండల ఉపాధి హామీ ఎపిఓ రాజేష్ వర్మ సస్పెండ్ చేస్తున్నట్లు ఎంపీడీవో సాజిద్ అలీ శనివారం తెలిపారు. మండలంలోని కోస్లి వార్డు సభ్యుడు శైలేందర్ భార్య కొడుకుతో కలిసి ఇంకుడు గుంతల నిర్మాణంలో బిల్లు విషయమై ఏపీవో రాజేశ్వర్ లంచం అడిగాడని శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలపడం అంతకుముందు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పిడి చందర్ నాయక్ సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

దత్త జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని లింగంపల్లి గ్రామంలో గుట్టపై వెలిసిన శ్రీకృష్ణ మందిరంలో దత్త జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం రాత్రి గ్రామంలోని ప్రధాన వీధుల్లో రథాన్ని ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భజన మండలి పోటీలను నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల కోసం వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండెల్లి సాయిలు, ఉపసర్పంచ్ దమోదర్, దేవాదాయ కమిటీ సభ్యులు వివిధ గ్రామల ప్రజలు పాల్గొన్నారు.

పేకాటాడుతున్న ముగ్గురు వ్యక్తులపై కేసు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామ శివారులో బహిరంగంగా శనివారం పేకాటాడుతున్న ముగ్గురు వ్యక్తుల నుండి రూ.3520 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎవరైనా ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 8712659853, లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని, తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు

రిసోర్స్ మ్యాప్ ద్వారా రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ నీటి వనరుల రిసోర్స్ మ్యాప్ ద్వారా గ్రామంలో ఉన్న బోర్లు, బావులు, కుంటలు, చెరువులను గుర్తించినట్టు రిలయన్స్ ఫౌండేషన్ ఇంజనీర్ సూర్య ఆర్ఎఫ్ భూపతి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు మొక్కజొన్న, పత్తి, కూరగాయలు పంటలు ఎక్కువగా పండిస్తారని దీనికి అనుగుణంగా అవసరం ఉన్నచోట కుంటలు, చెక్ డ్యాములు, డ్రైనేజీ, కాలువ పూడిక నిర్మాణాల గురించి రైతులకు వివరించారు. అనంతరం పాడి పశువుల గురించి రిసోర్స్ పర్సన్ రాజేశ్వరి మాట్లాడుతూ.. పశువులలో నాణ్యమైన బ్రీడ్ సెలక్షన్, పశుపోషణలో మెలకువలు, పాలదిగుబడి పాలలో వెన్న శాతం పెంచుకునే మెలకువలు, మినరల్ మిక్సర్, పశువుల షెడ్ గురించి సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతిరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి రవి, విష్ణువర్ధన్‌రెడ్డి, యాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 3న ఛలో ఢిల్లీ

- విజయవంతం చేయాలి : పీడీఎస్‌యూ




మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నూతన జాతీయ విద్యా విధానం రద్దు కోరుతూ.. ఫిబ్రవరి 3న నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిడిఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పిడిఎస్‌యూ జిల్లా కమిటీ సమావేశాన్ని నీలం రామచంద్రయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.వి.శ్రీకాంత్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీలలో ప్రశ్నించే గొంతులను నొక్కుతూ, విద్యను మొత్తం కాషాయికరిస్తూ శాస్త్రీయత లేకుండా నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చారని తెలిపారు. చరిత్ర, సైన్స్ తదితర పాఠ్యాంశాలను తొలగిస్తూ మనువాద బ్రాహ్మణీయ పాఠ్యాంశాలను చేర్చుతున్నారని, కావున నూతన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 3వ తేదీన అఖిల భారత విద్య హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీ.డీ.ఎస్.యు నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.గౌతమ్‌కుమార్, జన్నారపు రాజేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు కార్తిక్, సహాయ కార్యదర్శి ప్రిన్స్, కోశాధికారి దేవిక, జిల్లా కమిటీ సభ్యులు రవీందర్, రామకృష్ణ, సాయినాథ్, నిఖిల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

మృతదేహం లభ్యమైన ఘటన డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బర్ధిపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సాయిబాబా ఆలయ ఓవర్‌హెడ్ ట్యాంక్ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ వివరాల ప్రకారం.. శరీరంపై దుస్తులు లేకుండా 40-45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎవరైనా ఆ మృతదేహాన్ని గుర్తు పడితే, ఎస్ఐ 8712659852, డిచ్‌పల్లి సిఐ 8712659851 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో...

సీసీరోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఎటుకేళ్లకు సీసీరోడ్డు నిర్మాణ పనులు శనివారం ప్రారంభించారు. సీసీరోడ్డు నిర్మించాలని ప్రజలు ఆర్టీసీ ఎండీ, ఆర్టీసీ డిఎంలకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఎట్టకేళకు స్పందించిన అధికారులు బస్టాండ్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగా సీసీ రోడ్లు లేక ఇబ్బందులపై గతంలో నవతెలంగాణలో కథనాలు ప్రచురితమయ్యాయి. ప్రస్తుతం సీసీ రోడ్డు పనులు ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వికలాంగుల సర్వే



నవతెలంగాణ-భిక్కనూర్

సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మండలంలోని వికలాంగుల సర్వేను ఐఆర్‌పి మహేందర్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను పరీక్షించి ముగ్గురు విద్యార్థులు అంగవైకల్యంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అలాగే అంగన్వాడీ కేంద్రంలో సర్వేను నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థుల సర్వే వచ్చే నెల10వ తేదీ వరకు కొనసాగుతుందని, ఐఆర్పి మహేందర్ తెలిపారు.

రుణాలతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- ఏపీఎం విక్రమ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఏపీఎం

నవతెలంగాణ-మెండోరా

ప్రభుత్వం మంజూరు చేసే రుణాలతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం విక్రమ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య ఈసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు ప్రభుత్వం కల్పించే అన్ని రకాల రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. అలాగే అన్ని రకాల సెర్ప్ కార్యక్రమాలను సమీక్షించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల మండల సమాఖ్య ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

చేపూర్ అంగన్వాడీ కేంద్రంలో అవగాహన


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారుల తల్లులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు సూపర్వైజర్ వెంకట రమణమ్మ తెలిపారు. శారీరక, సాంస్కృతిక, సృజనాత్మకత, మేధో వికాసం, బడికి సంసిద్ధత గురించి అవగాహన నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు శోభా దేవి, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక విద్య హైస్కూల్లో ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ మాట్లాడుతూ.. గణితం ప్రాముఖ్యతను తెలిపి మేధావులుగా తీర్చిదిద్దుతున్న గణిత ఉపాధ్యాయులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. గురువులు చెప్పిన మాటలను విని విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి పట్వారి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షులు చరణ్‌రెడ్డి పుష్పకరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భాషిత పాఠశాలలో గీతా జయంతి వేడుకలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో శ్రీ భాషిత పాఠశాలలో శనివారం గీతా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో పాఠశాల కరస్పాండెంట్ భగవద్గీత పుస్తకానికి పూజ చేసి జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, శ్రీ భాషిత పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్, ప్రిన్సిపాల్, ప్రోగ్రాం చైర్ పర్సన్ కావ్య ప్రభ, గట్ల రేఖ, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గం నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే మదన్మోహన్‌రావును శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజ్ దాస్, గాయాజ్, గోపి తదితరులున్నారు.

ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి

- యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత ప్రభుత్వం యూనివర్సిటీలలో ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయకపోవడం వలన యూనివర్సిటీ విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్ అన్నారు. శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థులకు సహాయ సౌకర్యాలు లేక ఎన్నో రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో స్ట్రీట్‌లైట్లు వెలగడం లేదని, ఇంతకు యూనివర్సిటీలో ఉండే అధికారులు ఏమి చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం యూనివర్సిటీలలో ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకపోవడం వలన యూనివర్సిటీ విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారిందన్నారు. విద్యార్థులపై మెస్‌చార్జీల అదనపు భారాన్ని తగ్గించాలన్నారు. యూనివర్సిటీ అధికారులు విద్యార్థుల సౌకర్యార్థం కోసం హాస్టల్లో వైఫై పునరుద్ధరణ, సెల్ టవర్లను ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షులు ప్రసాద్, సహాయ కార్యదర్శి పవన్, నాయకులు చిత్రు, ప్రహ్లాద్, శంకర్, లక్ష్మణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.


పాఠశాల వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు

చౌట్‌పల్లి పాఠశాల ఎంపిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌కు మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ఆటోమేటిక్ టాయిలెట్ క్లీనర్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఎస్.ఆంద్రయ్య శనివారం తెలిపారు. ఈనెల 26 నుంచి 31వ వరకు మహారాష్ట్రలోని పూణే శివ ఛత్రపతి క్రీడా సంకుల్ బద్వేదిలో జరగనున్న జాతీయస్థాయి 50వ రాష్ట్రీయ బాలవైజ్ఞానిక ప్రదర్శిని 2023 సంవత్సరానికి చౌట్‌పల్లి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు జి.రోహిత్, సిహెచ్ శివకుమార్ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు పాల్దే రాజు పర్యవేక్షణలో ఏటీసీ (ఆటోమేటిక్ టాయిలెట్ క్లీనర్) తయారు చేసినట్లు తెలిపారు. ఈ పరికరం ఉపయోగించడం వల్ల పాఠశాలలో, పబ్లిక్ ప్రదేశాలలో, రైల్వే స్టేషన్లలో టాయిలెట్స్ ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంటాయన్నారు. పూణేలో 26 నుంచి 31 వరకు జరిగే జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు విద్యార్థులు వెళ్తున్నారని, ఇందుకు గ్రామస్తులు సహకరించడం అభినందనీయమన్నారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పూణేకు బయలుదేరి వెళుతున్న విద్యార్థులను, గైడ్ టీచర్ పాల్దే రాజును పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య, ఉపాధ్యాయులు ఎం.సాయన్న, మధుబాబు, ఏశాల శ్రీనివాస్, త్రిలోచన్, ప్రవళిక, వర్ష, ప్రేమలత, గీత, నవ్య, సీఆర్పీ అంజయ్య, జూనియర్ అసిస్టెంట్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి యోజన ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి

- అర్గుల్ సర్పంచ్ గోర్త పద్మ రాజేందర్


సంకల్ప పోస్టర్ల ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రధానమంత్రి యోజన ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని అర్గుల్ సర్పంచ్ గోర్త పద్మ రాజేందర్ అన్నారు. శనివారం మండలంలోని అర్గుల్ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వికసిత్ భారత్ సంకల్ప వాహనానికి విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు చప్పట్లతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోర్త పద్మ రాజేందర్ మాట్లాడుతూ.. ప్రతి మహిళా సంఘం సభ్యురాలు, ప్రతి పురుషుడు ప్రధానమంత్రి యోజన ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించినా.. మామూలుగా మరణించిన ఇన్సూరెన్స్ పథకాలు ఎస్బిఐ బ్యాంకులో చెల్లించుకోవాలని, ఈ ఇన్సూరెన్స్‌ల వల్ల మన కుటుంబాలు వీధిన పడకుండా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, ఉపసర్పంచ్ రాజేందర్, బిజెపి నాయకులు మండల ఇన్‌చార్జి ఎంపీడీవో బ్రహ్మానందం, ఏపిఎం రవీందర్‌రెడ్డి, ఏపీవో రవి, ఏఈఓ భాస్కర్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఐకెపి సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కరాటే శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పాఠశాలలో కరాటే శిక్షణ

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం బాలికలకు ఆత్మరక్షణ విద్యను అందించాలనే లక్ష్యంతో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలో గత నెల రోజులుగా విద్యార్థులకు కరాటే శిక్షణ అందిస్తున్నారు. బోధన్, సాలూర మండలాల్లో కరాటే శిక్షకులు కరాటే పల్లవి శిక్షణ ఇస్తున్నారు, బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసి)లో, సాలుర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అలాగే పలు ప్రైవేట్ కళాశాలలో కరాటే నిపుణులు కరాటే పల్లవి, ఖయ్యూం విద్యార్థులకు ఆత్మ రక్షణ విద్య కోసం కరాటే నేర్పుతున్నారు. విద్యార్థులు కూడా ఈ కరాటే శిక్షణలో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసి) హెచ్‌ఎం బాలచంద్రం తెలిపారు.

కరోనా పట్ల భయభ్రాంతులకు గురికావొద్దు

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

కరోనా నాలుగో దశ వేరియంట్ దేశంలో, రాష్ట్రంలో వ్యాప్తిస్తున్న సందర్భంగా ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని, స్వీయ రక్షణ చేపట్టి కరోనాను కలిసికట్టుగా ఎదుర్కొందామని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు రద్దీప్రదేశంలో మాస్కులు ధరించాలని, వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక రోగులు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర సమయంలో వైద్యుల సలహాలతో, వైద్యాన్ని తీసుకోవాలని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను

సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీవో శంకర్


మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శంకర్ ప్రజలకు వివరించారు. శనివారం మధ్యాహ్నం మౌలాలి తాండ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ జాదవ్ సునీత బాబు నాయక్ అధ్యక్షత వహించారు. మారుమూల గ్రామాలలో ప్రభుత్వ పథకాలు అందలేని నిరుపేదలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. 17 శాఖలకు సంబంధించిన అధికారులతో గ్రామప్రజలకు వివరించారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన, పీఎం ముద్ర యోజన, సుకన్య సమృద్ధి యోజన, పీఎం భారతీయ జన ఉషధి పరి యోజన, లాంటి పథకాలను ప్రవేశపెట్టి నిరుపేదలకు అందుబాటులో నాణ్యమైన మందులు లభ్యమవుతాయని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీఓ గౌస్ ఉద్దీన్, బ్యాంకు మేనేజర్ సంతోష్, వైద్య సిబ్బంది రవీందర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, డీలర్ పార్వతి రాజేశ్వర్, గ్రామ కార్యదర్శి రజిత అంగన్వాడీ కార్యకర్త కరుణ, రాజమనీ, నీలిమ, అంగన్వాడీ కార్యకర్తలు ఆశలు పాల్గొన్నారు.

అలీసాగర్ ఎత్తిపోతల

నీటి విడుదలకు తరలిన కాంగ్రెస్ నాయకులు


ఎమ్మెల్యేతో మండల నాయకులు

నవతెలంగాణ-రెంజల్

యాసంగిలో రైతులకు సాగునీటి అందించాలన్న తలంపుతో బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి సాగునీరు విడుదల చేయడంతో రెంజల్ మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. రైతు బాంధవుడు, రైతుల పక్షపాతి అయిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మొదట రైతులకు సాగునీటి అందించాలన్న ఉద్దేశంతో దానిని ప్రారంభించగా మండలం నుంచి నాయకులు కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో తరలివెళ్లారు. తరలిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్, జి.సాయిరెడ్డి, సిహెచ్.రాములు, ధనుంజయ్, లచ్చేవార్ నితీన్, సాయిబాబాగౌడ్, గయా సుద్దీన్, హనుమంతరావు, మోహన్, సాయినాథ్, సురేష్, షహబాజ్, సయ్యద్ సల్మాన్, రవి, జంగం గంగాధర్, సద్దాం, కార్తీక్ యాదవ్, ఎల్ కృష్ణ, గైని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

- ఘనంగా వైకుంఠ ఏకాదశి


డిచ్‌పల్లిలో..

నవతెలంగాణ-విలేకరుల బృందం

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు కిటకిటలాడాయి. ప్రజలు పెద్దఎత్తున ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లింగంపేట్: మండలంలోని అయ్యపల్లి గ్రామ సమీపంలోని ప్రభుస్వామి ఆలయం, శెట్టిపల్లి గ్రామ సమీపంలో మల్లికార్జున ఆలయం, కోమటిపల్లి గ్రామ సమీపంలోని అల్లు రమ్మ ఆలయం పోల్కంపేట్ గ్రామంలోని హరగోపాలస్వామి ఆలయం, బానాపూర్ గ్రామంలో రామాలయం, లింగపేట మండల కేంద్రంలో సాయిబాబా ఆలయం, శివాలయం, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాల్కొండ: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని వివి ధ ఆలయాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల యాలను ప్రత్యేకంగా అలంకరించారు. మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయం, వన్నెల్.బి గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

వైకుంఠ ఏకాదశి పూజలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే..

నిజామాబాద్‌సిటీ: నిజామాబాద్ నగరంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని సుభాష్‌నగర్‌లోని రామలయాన్ని, జెండా బాలాజీ దేవాలయాలను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనా రాయణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈఓ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా జెడ్పిటిసి తీగల తిరుమలగౌడ్, ప్రజాప్రతినిధులు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా వసతులు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, కదిరే గోపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు లింగ రాజేందర్, దుర్గారెడ్డి, నర్సింలు, ఈవో ప్రభు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్, ఖిల్లా డిచ్‌పల్లితో పాటు ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లితో పాటు ఆయా గ్రామాలలో వైకుంఠ ఏకాదశి నుంచి ఘనంగా నిర్వహించారు. బెటాలియన్‌లో కమాండెంట్ బి.రాంప్రకాష్ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకోని బెటాలియన్ అవరణంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామిని ఉత్తరముఖ ద్వారం గుండా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కె.భాస్కర్‌రావు, ఆర్ఐలు మహేష్, బి.శ్యామ్‌రావు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది, ఆయా గ్రామాలలో ప్రజలు పాల్గొన్నారు.

అపురూపలో వైకుంఠ ఏకాదశి..

మాక్లూర్: మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులో గల అపురూప వెంకటేశ్వర ఆలయంలో తొలి ఏకాదశి, వైకుంఠ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రజలు శ్రీ మహా విష్ణువును దర్శించుకున్నారు. ప్రత్యేక పూజాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్, ఆర్మూర్, చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

బోధన్: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంఘం గ్రామంలో ఉప సర్పంచ్, ప్రముఖ న్యాయవాది శంకర్ హనుమాన్ మందిరం వద్ద భక్తులకు అన్నదానం చేపట్టారు. బోధన్ పట్టణంలోని విజయసాయి హై స్కూల్లో అయ్యప్ప స్వాములు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

భిక్కనూర్: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారిని ఉత్తర ద్వారం ద్వారా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సిద్దిరాములు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, అల్పాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు దాయరి సాయిరెడ్డి, నాయకులు దుర్గారెడ్డి, నర్సారెడ్డి, భక్తులు, అయ్యప్ప మాల ధరించిన స్వాములు పాల్గొన్నారు.


దోమకొండలో పూజలు

నలంద పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లిలో నలంద హైస్కూల్లో శనివారం క్రిస్మ స్ వేడుకలు నిర్వహించారు. క్రీస్తు జన్మదినం పురస్కరించుకుని ప్రతి సంవత్సరం డిసెంబర్ 25 రోజు ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే పండుగ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా నలంద విద్యార్థులు ఆటపాటలతో, కేరింతలతో అలరించారు. శాంటా క్లాస్ తాతయ్య వేషం ధరించి బహుమతులు అందజేశారు. కేక్ కట్ చేసి చాలా ఉత్సాహంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నలంద యాజమాన్యం ప్రసాద్, సాగర్ మాట్లా డుతూ.. తమ పాఠశాలలో కుల మతాలకతీతంగా మన ఆచార వ్యవహారాల గురించి ప్రతి ఒక్క పండుగ ఒక వేడుక లాగా నిర్వహించి ప్రతి పండుగ ఉన్నత అన్ని విద్యార్థులకు తెలియజేయడం కోసం ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామ ని తెలియజేశారు. కార్యక్రమ ంలో పాఠశాల యాజమా న్యం ఉపాధ్యాయుని ఉపా ధ్యాయులు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
ఆదివారం | డిసెంబర్ 24, 2023 | www.navatelangana.com

పాఠశాల గదుల నిర్మాణానికి ఆర్థిక సహాయం


ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని పాఠశాలకు అదనపు గదుల నిర్మాణానికి డెవలప్మెంట్ కమిటీకి మాదిగ సంఘం సభ్యులు రూ.25,000 విరళంగా అందజేశారు. స్కూల్ డెవలప్మెంట్ కమిటీ తరుపున జక్రాన్‌పల్లి గ్రామస్తుల తరుపున వారికీ, వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త పైపుల రాజిరెడ్డి, సర్పంచ్ చంద్రకళ బాలకిషన్, ఎంపీటీసీలు గంగారెడ్డి, తలారి మరియా సతీష్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులున్నారు.

గ్రామసభ గందరగోళం


సభలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-పొతంగల్

పొతంగల్ గ్రామసభలో గందరగోళం నెలకొంది. శనివారం సర్పంచ్ వర్ని శంకర్ అధ్యక్షతన పొతంగల్ గ్రామ సభను నిర్వహించారు. కాగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల విషయంలో అడిగిన ప్రశ్నలకు ప్రస్తుత సర్పంచ్ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్‌రూం కేటాయింపు, మంజూరైన జాబితా తెలపాలని ప్రజలు పెద్ద సంఖ్యలో డిమాండ్ చేశారు. కాగా సర్పంచ్ సరైన సమాధానం ఇవ్వలేదు.

బాధ్యతలు విస్మరిస్తే చర్యలు తప్పవు

- ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు
- ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ తనిఖీ

నవతెలంగాణ-పిట్లం/బిచ్కుంద

బాధ్యతలు విస్మరిస్తే చర్యలు తప్పవని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సామాన్య రోగుల పట్ల ప్రభుత్వ వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించినా, విధులకు ఎగనామం పెట్టినా సహించేది లేదన్నారు. సిబ్బందిలో ఎవరైనా సమయపాలన పాటించకుంటే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. వైద్య సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. వార్డులలోని రోగులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకుని, నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు, మైనార్టీ సోదరులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి..

బిచ్కుంద : ఏసుక్రీస్తు బోధించిన బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడవాలని జుక్కల్ శాసనసభ్యులు తోటలక్ష్మీకాంతరావు అన్నారు. క్రిస్మస్ పండుగ వేడుకల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన క్రిస్మస్ కానుకల బహుకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పాల్గొని కానుకలను ప్రజలకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బైబిల్‌లో సూచించిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ అనుసరించి ఇరుగు పొరుగు వారికి సహాయ పడాలని అన్నారు. పాస్టర్లు పాటలు పాడుతూ ఏసుక్రీస్తు బోధించిన బోధనలు బోధించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సాయాగౌడ్, పీసీసీ డెలిగేట్ విట్టల్ రెడ్డి, జుక్కల్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మున్నూరు నాగనాథ్, మాజీ ఏఎంసి చైర్మన్ మల్లికార్జునప్ప, పార్టీ మండల అధ్యక్షులు ధర్పల్లి గంగాధర్, మైనార్టీ నాయకులు పాషా సెట్, నౌషా నాయక్, తహసిల్దార్ లక్ష్మణ్, ఎండిఓ ఆనంద్, పాస్టర్ శైలేష్ ఆ గ్రామాల పాస్టర్లు, ప్రజలు పాల్గొన్నారు.


ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా వైకుంఠ ఏకాదశి


మోపాల్ : వైకుంఠ ఏకాదశి వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

సిరికొండ : మండల కేంద్రంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ శేష సాయి లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఉదయం 5గంటల నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణమంతా హరినామస్మరణతో మారుమోగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగిరెడ్డిపేట్: వైకుంఠ తొలి ఏకాదశి సందర్భంగా నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో గల వేణుగోపాల స్వామి ఆలయంలో తొలి ఏకాదశి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వారం నుంచి పల్లకి సేవా నిర్వహించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు. పల్లకి సేవ అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల వేణుగోపాల స్వామి ఆలయంలో మాజీ సర్పంచ్ విఠల్ రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన వెంట మాణిక్యం, మంత్రి ఆంజనేయులు, వంశీగౌడ్, సంతోష్ తదితరులున్నారు.

నర్సింగ్‌పల్లిలో..

మోపాల్ : ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం నర్సింగ్‌పల్లిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రాతఃకాల వేళ సూర్యోదయానికి పూర్వమే స్వామి వారి గరుడవాహన సేవ తరువాత ఉత్తర ద్వార దర్శనం చేపట్టారు. శ్రీ శ్రీ శ్రీ దేవనాథ్ జీయర్ స్వామి, శ్రీ శ్రీ శ్రీ గంగోత్రి రామానుత దాసు స్వామి చేతుల మీదుగా ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ చేపట్టారు. ప్రథమ క్యాలెండర్‌ను రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు, నుడా చైర్మెన్ ఈగ సంజీవరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఐసిడీఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, ఆలయ ధర్మకర్త శ్రీమాన్ నర్సింహారెడ్డితో పాటు నర్సారెడ్డి, రవీందర్ యాదవ్, ప్రసాద్, నరాల సుధాకర్, రాజేశ్వర్, సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీ రాములు, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఘనంగా పెద్దమ్మ 20వ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామ పరిధిలోని ధర్పల్లి, ఇందల్‌వాయి రహదారిపై ఉన్న పెద్దమ్మ 20వ వార్షికోత్సవాన్ని ముదిరాజ్ సంఘం సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని పలు వీధుల గుండా బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఆలయానికి డప్పు, వాయిద్యాలతో చేరుకున్నారు. ఆలయంలో అభిషేకం, అర్చనలు, కళ్యాణం చేసిన అనంతరం అన్నసత్రం నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు రవి ముదిరాజ్ తెలిపారు. ఈ వార్షికోత్సవంలో భాగంగా ప్రతి ఏటా అంగరంగ వైభవంగా గ్రామం నుంచి ఆలయం వరకు భారీ సంఖ్యలో బోనాలను ఊరేగించారు. కార్యక్రమంలో ఆర్.సాయిలు ముదిరాజ్, పి.నడ్పి సాయిలు, గంగాధర్, సాగర్, మల్లయ్య, సునీల్, రజనీకాంత్, గంగారం, లక్ష్మన్, మహిళలు, గ్రామస్తులు ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు కలిగోట్ క్రీడాకారిణిలు


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన ఎస్.పూజ అండర్ 17 పి.ప్రవళిక అండర్ 14, రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పురుషోత్తమాచారి తెలిపారు. ఈనెల 23 నుంచి 25 వరకు వరంగల్ జిల్లా తొర్రూర్‌లో జరిగే బీచ్ వాలీబాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.పూజ, పి.ప్రవళికను సర్పంచ్ చేతన విజయరెడ్డి, ఉప సర్పంచ్ నాయిక రాజు, ఎంపీటీసీ జయ గిరిధర్‌గౌడ్, ఎస్ఎంసి చైర్మన్ సత్యనారాయణ, గ్రామ కమిటీ సభ్యులు వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సెమీ క్రిస్మస్ సంబరాలు



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కిడ్స్ పార్క్ స్కూల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా ప్రతి సంవత్సరం పండగలను నిర్వహిస్తామని అన్నారు. అనంతరం విద్యార్థులను చర్చికి తీసుకొని వెళ్లి అక్కడ క్రిస్మస్ ఎందుకు జరుపుకుంటారు?, ఏసుక్రీస్తు పుట్టుకను వివరించారు. అనంతరం విద్యార్థులందరూ కేక్ కట్ చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు అయ్యప్ప మహా పడిపూజ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో ఈనెల 25న అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవా సమితి భక్తులు శనివారం తెలిపారు. మహా పడిపూజ ఎల్లారెడ్డి ముదిగొండ చంద్రం గురుస్వామి, వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామని అయ్యప్ప సేవ సమితి సభ్యులు తెలిపారు.

వృత్తికళాకారుడు మృతి

- పిఎన్ఎం, సిఐటీయు ఆధ్వర్యంలో నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్


నివాళులర్పిస్తున్న నాయకులు

వృత్తి కళాకారుడు (తాంబూర వీణ సంగీత వాయిద్యాలు) మిరియాల సాయిలు (60) శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు అనారోగ్యంతో నిద్రలోనే మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం, సిఐటీయు జిల్లా కమిటీ సభ్యులు కటారి రాములు వారి కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. అనంతరం మిరియాల సాయిలు భౌతిక కాయానికి నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శి సిర్పలింగం మాట్లాడుతూ.. గ్రామీణ జానపద వృత్తిపరమైన తెలంగాణ సాంస్కృతికపరమైన, అణగారిన వర్గాల కళాకారులకు జీవిత బీమా నిరుద్యోగ భృతి, ఇతర ప్రోత్సాహక పథకాలు అందిస్తామని తెలంగాణ ఉద్యమంలో వరాల జల్లు కురిపించిన గత ప్రభుత్వం ఆ హామీలను ఏమాత్రం నెరవేర్చని కారణంగా ఇలాంటి అభాగ్య కళాకారులు కడిపేదరికంతో జీవితాన్ని గడుపుతూ చివరికి నిస్సహాయ పరిస్థితుల్లో మరణిస్తున్నటువంటి పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కళాకారులు తెలంగాణ రాష్ట్రంలో ఎందరో ఉన్నారని అమూల్యమైన విద్య ఈ కళాకారుల సొంతమని అలాంటి కళాకారులను చేరదీసి ఆదరించి ప్రోత్సహించాలని, నూతనంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిఐటీయు ఆటో వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు తూరిపాటి కృష్ణ, ఆర్‌టిఐ నాయకులు చిలుక శ్రీను పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీని విజయవంతం చేయాలి

- ఎస్ఎఫ్ఐ నాయకుల పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జనవరి 12న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిజామాబాద్ నగర కమిటీ ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో జనవరి 12న ఎస్ఎఫ్ఐ, ఇతర 16 విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక కోటగల్లి జూనియర్ కళాశాల నందు ఛలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి పోషమైన మహేష్ మాట్లాడుతూ.. జనవరి 12న నిర్వహించబోయే చలో పార్లమెంటు ముఖ్య డిమాండ్స్ ప్రభుత్వం ముందు ఉంచుతున్నామన్నారు. ఉన్నత విద్యకు అధిక నిధులు కేటాయించాలన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థి ఎన్నికలు నిర్వహించాలని, జాతీయ విద్యావిధానం 2020 రద్దు, నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం ఉపాధి గ్యారెంటీ చేసి అందరికీ విద్య ఉపాధి కల్పించాలని, రోహిత్ చట్టాన్ని అమలు చేసి, కులం, ఆర్థిక స్థితి ఆధారంగా వివక్ష లేకుండా చట్టం చేయాలన్నారు. ప్రతి క్యాంపస్‌లో జిఎస్ కమిటీని ఏర్పాటు చేసి అన్ని విద్యాసంస్థల్లో లైంగిక వేధింపులు, లింగ వివక్ష లేకుండా చేయాలన్నారు. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అన్ని విద్యాసంస్థల్లో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ డిమాండ్స్‌పై అలాగే ఇతర విద్యారంగ సమస్యలపై జనవరి 12న నిర్వహించే ఛలో పార్లమెంటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు విశాల్, నగర నాయకులు గంగోత్రి, లక్ష్మీ జూనియర్ కాలేజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సవరించాలి

- ఆటో డ్రైవర్లకు రూ.3వేలు అందజేయాలి
- డిఎస్పీ డిమాండ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి

డిసెంబర్ 9న తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించిందని, కానీ ఈ ఉచిత ప్రయాణంలో చాలా అనర్థాలు, నష్టాలు ఉన్నాయని అందుకని హేతుబద్ధంగా ఈ ఉచిత ప్రయాణాన్ని సవరించాల్సి ఉందని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు భాస్కర్ అన్నారు. డిఎస్పి అధినేత డాక్టర్.విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు శనివారం ఇందల్‌వాయి తహసీల్దార్ వెంకట్రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నెలకు రూ.లక్ష రూపాయలు సంపాదించే మహిళా ఉద్యోగస్తులకు ఉచిత ప్రయాణాన్ని వర్తింప చేయవద్దని, ఉచిత ప్రయాణం ప్రభావం ఆటో కార్మికులపై పడుతుందని, తద్వారా ఆటో కార్మికులకు తీవ్ర నష్టానికి గురవుతున్నారని, ఈ నష్టాన్ని భరించడానికి ఆటో నడిపే కార్మికుడికి నెలకు రూ.3,000 చొప్పున ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సాయిలు, రంజిత్, రవి, అరుణ్, వంశీ, గణేష్, రమేష్ పాల్గొన్నారు.


జక్రాన్‌పల్లి : వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

జక్రాన్‌పల్లి : తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించాలని జక్రాన్‌పల్లి మండల ధర్మ సమాజ పార్టీ నాయకులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత ప్రయాణాన్ని హేతుబద్ధంగా సవరించాలని తెలియజేస్తూ ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు మహేష్ మహారాజ్ మాట్లాడుతూ.. డిసెంబర్ 9న తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించిందని, కానీ ఉచిత ప్రయాణంలో చాలా అనర్థాలు, నష్టాలున్నాయని అందుకని హేతుబద్ధంగా ఈ ఉచిత ప్రయాణాన్ని సవరించాలని తెలియజేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాన్ని తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే అవకాశం కల్పించాలని తెలియజేశారు. దీనివల్ల ధనవంతులైన మహిళల ఉచిత ప్రయాణాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. నెలకు రూ.లక్ష సంపాదించే మహిళా ఉద్యోగస్తుల ఉచిత ప్రయాణాన్ని నియంత్రించవచ్చని సూచించారు. అదే ఆర్టీసీ బస్సులలో తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలైన ఇంటిని పోషించే పురుషులకు కూడా ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సులలో ఈ ఉచిత ప్రయాణం ప్రభావం ఆటో కార్మికులపై పడుతుందని, తద్వారా ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నష్టాన్ని భరించడానికి ఆటోనడిపే కార్మికులందరికీ నెలకు రూ.3000 చొప్పున ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణాన్ని ఈ విధంగా సంస్కరించి, సవరించి అన్ని వర్గాలకు మేలు చేకూర్చే పథకంగా సరిచెయ్యాలని ధర్మ సమాజ్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల మీడియా ఇన్‌చార్జి రవి, మండల నాయకులు కిరణ్, భుమన్న, సందీప్, యశ్వంత్, మహారాజ్ పాల్గొన్నారు.

అక్రమ మొరం తవ్వకాలు చేపడుతున్న జెసిబి, టిప్పర్ల పట్టివేత


జేసీబీ, టిప్పర్లను పట్టుకున్న అధికారులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం ఊటుపల్లి గ్రామ శివారులో గత కొన్ని రోజులుగా అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతూ మొరం తరలిస్తున్న జెసిబిని, మూడు మొరం టిప్పర్లను శుక్రవారం రాత్రి బోధన్ తహసిల్దార్ గంగాధర్, రూరల్ ఎస్సై నాగనాథ్, ఏఎస్ఐ రవీందర్ దాడులు చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతి లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలు జరిపిన వాహనాలను రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరచించి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. పట్టుకున్న వాహనాలను బోధన రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు.

రాష్ట్రంలోని సిఓఈ కళాశాల ఎంట్రెన్స్‌కి నోటిఫికేషన్ విడుదల

- దరఖాస్తుకు జనవరి 15 చివరి తేదీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభ కళాశాలల్లో 2024-2025 విద్య సంవత్సరం ప్రవేశం కోసం నోటిఫికేషన్ విడుదలైందని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాల ధర్మారం(బి) ప్రిన్సిపాల్, జిల్లా కో ఆర్డినేటర్ బి.సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 38 సోషల్ వెల్ఫేర్ ప్రతిభ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసిఇ, సిఈసి గ్రూపులలో ప్రవేశాల కొరకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రతిభా కళాశాలలో ఐఐటి, జేఈఈ, నీట్, ఎంసెట్, సియంఎ క్లాట్ పరీక్షల కొరకు ఉచిత శిక్షణ అందజేస్తామని తెలిపారు. ప్రవేశ ప్రకటన పూర్తి వివరాలు, ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాన్సువాడ ఎమ్మెల్యేను సన్మానించిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-జక్రాన్ పల్లి

బాన్సువాడ ఎమ్మెల్యేను జక్రాన్‌పల్లి మండల ప్రజాప్రతినిధులు శాలువాతో ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీపీ మైదం రాజన్న, ఎంపీపీ కుంచాల విమల రాజు, అప్పల రాజన్న శాలువాలతో ఘనంగా సన్మానించారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

స్వామి దయానంద సరస్వతి విగ్రహానికి నివాళి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లో గల స్వామి దయానంద సరస్వతి విగ్రహానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్యసమాజ్ అధ్యక్షులు కరిపే సూర్యప్రకాష్, మార్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు లాభిషెట్టి శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ పంచారెడ్డి ప్రవళిక శ్రీధర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, బట్టికర్ ఆనంద్, పవన్ ముందడ, మఠం పవన్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

దంత వైద్యశాలను ప్రారంభించిన పోచారం

నవతెలంగాణ-వర్ని(బాన్సువాడ)

పట్టణ కేంద్రంలో రాకేష్ దంత వైద్యశాలను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల ప్రాంత నివాసులు చందూర్ మండలం లక్ష్మపూర్ సర్పంచ్ సత్యనారాయణ కుమారుడు బాన్సువాడ పట్టణంలో దంత వైద్యశాలను ఏర్పాటు చేయటం, ప్రజలకు అన్ని రకాల వైద్యం అందించే ఆసుపత్రులు నియోజకవర్గంలో ఉండటం అభినందనీయమని అన్నారు. వైద్యులు దైవ సమానులని ప్రజలకు ఉచిత వైద్య సేవలు కూడా అందించడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఆయనతోపాటు లక్ష్యంపూర్ సర్పంచ్ సత్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పి.వి.నరసింహారావు వర్ధంతి


నివాళి అర్పిస్తున్న పాఠశాల సిబ్బంది

నవతెలంగాణ-సిరికొండ

భారతదేశ పురోగతికి, స్వావలంబనకు ఆద్యుడు పి.వి.నరసింహారావు అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అన్నారు. మాజీ ప్రధాని బహుభాషా కోవిదుడు, తెలంగాణ ముద్దు బిడ్డ పాములపర్తి వెంకట నరసింహారావు 19వ వర్ధంతిని సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించారు. మొదటగా ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య పి.వి.చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. పి.వి. నరసింహరావు బాల్యం నుంచి చదువులలో రాణిస్తూ విభిన్న భాషలపై పట్టు సాధించిన బహుభాషా కోవిదుడుగా, దేశం రాజకీయ, ఆర్థిక సంక్షోభంతో క్లిష్ట పరిస్థితులలో తన చతురతను చూపించి వినూత్న ఆర్థిక సంస్కరణలకు నాంది పలికి దేశ పురోగతికి స్వావలంబనకు ఆద్యుడై, అగ్రగామి దేశల సరసన భారతదేశాన్ని నిలిపిన మహనీయుడు పి.వి.నరసింహారావు అని కొనియాడారు. మహనీయుల జీవితాశయాలను నెరవేర్చడంలో ప్రతి ఒక్కరం క్రియాశీలక పాత్ర పోషించి మనుగడనిచ్చే మానవీయ విలువల సమాజ నిర్మాణాలకు సోపనాలు కావాలన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని పెద్దవాల్గొట్ గ్రామంలో అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజను శనివారం నిర్వహించారు. శ్రీనివాస్ పంతులు (గురుస్వామి) మాట్లాడుతూ.. వినాయక స్వామి, కుమారస్వామి, అయ్యప్ప స్వామి అర్చన అలంకారాలు చేసి అభిషేకం నిర్వహించామని, పల్లకిలో స్వామివారిని ఊరెగింపు నిర్వహించి ముక్కోటి ఏకాదశి నాడు ఈ కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా అన్నారు. కార్యక్రమంలో బిఆర్‌యస్ మండల అధ్యక్షులు నారబోయిన శ్రీను, సర్పంచ్ గంగదాస్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ నియోజకవర్గ బీసీ అధ్యక్షులుగా అశోక్


నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కెంపుల నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగందుల మురళి, నగరంలోని గీతా భవన్ కార్యాలయం వద్ద బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షులుగా మొండి అశోక్‌కు శనివారం నియామకపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణరావు, శ్యాం, బీసీ నాయకులు పంచారెడ్డి చరణ్, స్వామి యాదవ్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి విడుదల చేసిన ఎమ్మెల్యే


విడుదలవుతున్న సాగునీరు

నవతెలంగాణ-రెంజల్

రైతులకు సాగునీరు అందించాలన్న తలంపుతో శనివారం బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని విడుదల చేశారు. రైతులు నారుమడులు సాగుచేసుకుని వరినాట్లకు సిద్ధమయ్యారని, అందులో భాగంగా విడతల వారీగా సాగునీటిని అందించాలన్న తలంపుతో నీటిని ప్రారంభించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండలంలోని పడగల్ గ్రామానికి చెందిన కొట్టాల మల్లారెడ్డి (శేకం) కుటుంబ సభ్యులను శనివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో కొట్టాల మల్లారెడ్డి మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల పాలెపు నరసయ్య, పడిగల ప్రవీణ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రమ వెలకట్టలేనిది

- ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

నవతెలంగాణ-విలేకరుల బృందం

రైతుల శ్రమ వెలకట్టలేనిదని పలువురు అన్నారు. శనివారం పలుచోట్ల జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

సిరికొండ : మండల కేంద్రంలో జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సత్యశోధక్ పాఠశాల చిన్నారులు జై కిసాన్ అనే ఆంగ్ల అక్షర ఆకారంలో కూర్చొని శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి అన్నం పెడుతున్న రైతుల శ్రమ వెలకట్టలేనిదని ప్రపంచీకరణలో పరిణామాలు ఎన్ని సంతరించిన రైతుల పాత్ర పోషించలేవని ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో వినూత్నమైన పరిణామాలు వచ్చిన దేశానికి వెన్నుముక రైతేనని అన్నారు. వ్యవసాయం అనేది అన్నింటికి సాయమందిస్తుందని రైతుల శ్రేయస్సు, వ్యవసాయానుబంధ రంగాలపై మనందరం అవగాహన కల్గి ఉండి రైతుల సామాజిక వికాసానికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సిరికొండ : సత్యశోధక్ పాఠశాలలో..

విశ్వ వికాస్ పాఠశాలలో..

నిజామాబాద్ సిటీ : విశ్వ వికాస్ విద్యార్థులు పలు గ్రామాల్లో పంటపొలాలను సందర్శించి జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి వారు వ్యవసాయం చేసే పద్ధతులను గమనించారు. నారు తీయడం, వరి వంగడాలను నాటడం, బురదలో వంగడాలను నాటే విధానం కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వ వికాస్ పాఠశాల ప్రిన్సిపాల్ సుస్మిత మాట్లాడుతూ.. తమ కార్యక్రమం వ్యవసాయ రంగంపై గౌరవాన్ని పెంపొందించిందని తెలిపారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారంగాపూర్ బీఈడీ కళాశాలలో..

నిజామాబాద్ రూరల్: తెలంగాణ యూనివర్సిటీ కళాశాలలో డాక్టర్ బి.సాయిలు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సారంగాపూర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.బి. సాయిలు ఎన్ఎస్ఎస్ యూనిట్ తేవడానికి సహకరించిన డాక్టర్ రవీందర్ రెడ్డికి, రిజిస్ట్రార్ యాదగిరికి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను రైతు కుటుంబం నుంచి వచ్చిన బిడ్డనే వ్యవసాయం చేయడంలో అనుభవం తనకు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్ రవీందర్, సీనియర్ ఆధ్యాపకుడు డాక్టర్ ఆర్ కరుణాకర్, హరిత, లింగమూర్తి, గణేష్, నవీన్, నరేందర్ పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల క్షత్రియ స్కూల్ విద్యార్థులు జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా క్షేత్ర పర్యటన నిర్వహించారు. పాఠశాల విద్యార్థులను మండలంలోని అంకాపూర్ వ్యవసాయ క్షేత్రానికి తీసుకువెళ్లారు. రైతులు వద్దకు వెళ్ళి వారు చేస్తున్న వ్యవసాయం పనులు పండిస్తున్న వరి, జొన్న, రాగి, వసుపు, కూరగాయల పంటలను పరిశీలించి.. సాగు ఎలా చేస్తారో అడిగి తెలుసుకున్నారు. ఏయే కాలాల్లో ఏయే పంటలు పండిస్తారో, ఏ పంటతో అధిక లాభాలు వస్తాయో రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అల్జాపూర్ లక్ష్మీనారాయణ, స్కూల్ ప్రిన్సిపాల్ అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు



నిజామాబాద్‌సిటీ : విశ్వ వికాస్ పాఠశాల ఆధ్వర్యంలో..



నిజామాబాద్ రూరల్ : బీఈడీ కళాశాలలో..


ఆర్మూర్ : క్షత్రియ స్కూల్ ఆధ్వర్యంలో..

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

- స్త్రీ, పురుషులు సమానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ అన్నారు. శనివారం ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా రైతువేదికలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టబోయేది ఆడబిడ్డ, మగబిడ్డ అని అడగవద్దని అది చట్టరీత్యా నేరమన్నారు. ఈ పరీక్షలు జరిపిన వారికి ఐదేళ్ల జైలు శిక్ష రూ.50వేల రూపాయల జరిమానా విధించబడుతుందని వివరించారు. ఈ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్ష జరపమని ప్రోత్సహించిన వారికి కూడా ఈ శిక్ష ఉంటుందని, పుట్టబోయే శిశువు ఆడైనా, మగైన అందుకు కారణం పురుషులు అంటే తండ్రి అన్నారు. లింగ వివక్షతో గర్భస్రావానికి పాల్పడడం స్త్రీల ఆరోగ్యంతో చెలగాటమాడటమేనని తెలిపారు. తల్లి ప్రాణాలకు ముప్పు తెస్తాయని, పుట్టేది ఆడపిల్ల అయినా కుటుంబంలోకి ఆనందంగా ఆహ్వానించాలని తెలిపారు. జిల్లా సఖి కేంద్రం లీగల్ అడ్వైజర్ లావణ్య మాట్లాడుతూ.. ఇంకా బయట స్త్రీలు బాలికలు ఎదుర్కొంటున్న వివిధ రకాల హింసలు, లైంగిక హింస మానసిక శారీరక, ఆర్థిక రాజకీయ ఇన్సెల్ నుంచి రక్షణ కల్పించడానికి రాజ్యాంగపరంగా అనేక చట్టాలున్నాయన్నారు. జిల్లా మహిళా సాధికారికత జిల్లా కోఆర్డినేటర్ స్వప్న మాట్లాడుతూ.. మహిళలు పురుషులతో సమానంగా చూడాలని మహిళలు ఎందులోనూ పురుషులకు తక్కువ కాదని అన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్‌లు శోభ, భాగ్యలక్ష్మి, ఎం.ఎల్.ఎ్.పి. నవతా, ఐకెపి ఎపిఎం సువర్ణ, పోషణ అభియాన్ ఇన్చార్జ్ రాంబాబు, పుష్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి వై.శంకర్

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-రెంజల్

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తాడుబిలోలి సర్పంచ్ వేల్మల సునీత నరసయ్య గ్రామ ప్రజలను కోరారు. శనివారం మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 17శాఖల అంశాలకు సంబంధించిన అధికారులు పథకాల గురించి వివరించారు. ఈ అవకాశాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇల్లు లేని నిరుపేదలు, ఇప్పటివరకు గ్యాస్ సిలిండర్ వాడని వారికి ఉచితంగా సిలిండర్లు అందజేయనున్నట్టు తెలిపారు. వైద్య ఆరోగ్యం, తాగునీరు, ఆహార భద్రత భరోసా, సుకన్య సమృద్ధి యోజన, ఉజ్వల యోజన, అటల్ పెన్షన్, రైతు సంక్షేమానికి భరోసా లాంటి పథకాలను ప్రవేశపెట్టిందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చింతకుంట లక్ష్మి, ఎంపీడీవో శంకర్, ఎంపీఓ గౌస్ ఉద్దీన్, బ్యాంకు మేనేజర్ లక్ష్మీనారాయణ శాస్త్రి, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, మిషన్ భగీరథ గబ్బర్ సింగ్, వైద్య సిబ్బంది కరిపే రవీందర్, లక్ష్మీనారాయణ, సిసి కృష్ణ, గ్రామ కార్యదర్శి రాఘవేందర్ గౌడ్, ఫ్యాక్ట్ కంపెనీ నిర్వాహకులు నీలిమ, స్థానిక డీలర్ పార్వతీ రాజేశ్వర్, కారోబార్ అనంతరావు, అంగన్వాడి కార్యకర్తలు కరుణ, రాజమణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆటలతో మానసికోల్లాసం

- క్లబ్ అధ్యక్షుడు పోలబోయిన సత్యం

నవతెలంగాణ-కామారెడ్డి

ఆటలతో మానసికోల్లాసం కలుగుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు పోలబోయిన సత్యం అన్నారు. శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆటలతో మానసిక ఉల్లాసాన్ని పొందుతారని, ఆరోగ్యవంతమైన శరీరంలో చక్కటి ఆలోచనలు ఉంటాయని, పిల్లలు చదువుతోపాటు ఆటల పోటీల్లో పాల్గొని, క్రమశిక్షణతో మంచి చదువులు చదువుకొని భవిష్యత్తులో మంచి స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు. పాఠశాల స్థాపనలో విశేషమైన కృషిచేసిన డీఎల్ఎన్ శర్మ మాట్లాడుతూ.. పాఠశాల ఏర్పాటుకు తాను పడ్డ కష్టాన్ని వివరిస్తూ, పాఠశాల పట్ల తనకున్న అభిమానాన్ని చూపించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, సభ్యులు శ్రీశైలం, ధనంజయ, వై.శంకర్, నాగభూషణం, కృష్ణమూర్తి, రమణ, డివిఎల్ఎన్ శర్మ, ఎస్ఎన్.చారి, పూర్ణ చంద్రరావు, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ఆట వస్తువులను పంపిణీ చేస్తున్న దృశ్యం

కిందపడిన పత్తే.. జీవనాధారం

నవతెలంగాణ-జుక్కల్

కొందరు యువకులకు కిందపడిన పత్తే జీవనాధారంగా మారింది. పంట చేనుల్లోంచి మార్కెట్ తరలించే క్రమంలో కిందపడిన పత్తిని ఏరుకుని.. దానికి విక్రయించి పొట్టపోసుకుంటున్నారు.

జుక్కల్, మద్నూర్ మండలాల్లోని గ్రామాల రైతులు తాము పండించిన పత్తి పంటను మద్నూర్ మార్కెట్ యార్డుకు తరలించే విషయం తెలిసిందే. అయితే మండలంలోని జుక్కల్ నుంచి మద్నూర్ వెళ్లే నాలుగు వరుసల రోడ్డు వెంట వారు పత్తిని తరలిస్తుంటారు. రెండు మండలాలకు ఉమ్మడి మార్కెట్ కార్యాలయం ఒక్కటే కావడంతో రద్దీ బాగా ఉండి పత్తి అమ్మకాలు కొనసాగుతాయి. అయితే రోడ్డు నుంచి వస్తున్న పత్తిపంటను అమ్మకానికి మద్నూర్ మార్కెట్‌కు వాహనాలలో తరలిస్తున్న క్రమంలో రోడ్ల వెంట అక్కడక్కడ పత్తి పడిపోతుండటంతో గ్రామాల్లోని కొందరు యువకులు రోజుకు పదికిలోల వరకు పత్తిని సేకరించి కిరాణ దుకాణాలలో అమ్ముకుంటున్నారు. దీంతో రోజుకు ఐదారువందలు సంపాదిస్తున్నారు. వృథాగా పోయే పత్తిని జుక్కల్ మండలానికి చెందిన యువకులు, మహిళలు ఏరుకుని మరీ డబ్బులు సంపాదిస్తున్నారు.


పత్తి ఏరుకుంటున్న వ్యక్తి